# దీపం

బి.పి.కరుణాకర్



కుండ కడిగి నిండా నీళ్ళు ముంచుకుంది సీత. రెండు మెట్లు ఎక్కింది. కాలు జారింది. క్రింద పడి పోయేదల్లా చేయి ముందుకు చాపి తమాయించుకుంది. కుండ మెట్ల మీద పడి పగిలిపోయింది. తలెత్తి చుట్టూ ఒకసారి చూసింది. రేవు గట్టు మీదున్న చిటికేసర చెట్లు సాయంకాలపు మసక చీకట్లో ఒదిగిపోతున్నాయి. సీతకు ఒక్కసారిగా దుఃఖం ముంచుకు వచ్చింది. ఈ సంగతి తెలుస్తే అమ్మ తిడుతుంది. పెద్దోడికి, చిన్నోడికి చెబుతుంది. పెద్దోడు ఏమీ అనడు కాని, చిన్నోడు వూరుకోడు.

వాడికి కోపం ఎక్కువ. నాల్రోజుల క్రిందటే మంచి నీళ్ల కుండ పగిలిపోయింది. దాన్ని తనే పగల గొట్టింది. చిన్నోడు ఏఖయాల్లో ఉన్నాడో కాని తననేమీ అనలేదు. మరో కుండ కొనితెచ్చాడు. ఈసారి ఊరుకోడు.

పగిలిన ముక్కలు ఏరి చేత్తో పట్టుకుని గట్టు మీదకు వచ్చింది. ప్రక్కనే ఉన్న కంచెలోకి విసిరి వేసింది. వెనకకు తిరిగి ఇంటి వైపు నడవసాగింది. తనకు తగిలే తిట్లు తలుచుకుని సీత హృదయం భయంతో క్రమంగా భారం కాసాగింది.

ఇల్లు దగ్గరైంది.

చప్పుడు కాకుండా ఇంట్లోకి అడుగు పెట్టింది సీత. గదంతా చీకటిగా ఉంది. దీపం ఇంకా వెలిగించ లేదు. అడుగులు తడబడుతున్నాయి. వంటింట్లోకి నడిచింది. పొయ్యి దగ్గర కూర్చుని అట్టముక్కతో మంటను విసురుతున్న తల్లి దగ్గరకు వచ్చి ప్రక్కనే నిలబడింది.

"అమ్మోయ్" పిలిచింది సీత.

వెంకమ్మ తలెత్త లేదు.

సీత తిరిగి పిలిచింది.

వెంకమ్మ తలెత్తకుండానే, "ఏటే" అన్నది.

"ఇంటో దీపమెట్టనేదేటే"

వెంకమ్మ మాట్లాడలేదు.

"పెద్దోడు, సిన్నోడు రానేదా పొలం కాడ్నుండి?"

వెంకమ్మ తలతిప్పి సీత వంక చూసింది. ఏదో చెప్పబోయి ఆగిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. సీత తల్లి ప్రక్కనే కూర్చుని తల్లి చేతిలోని అట్టముక్కను తన చేతుల్లోకి తీసుకుంది.

"ఏమైనాది?" అడిగింది సీత.

వెంకమ్మ జవాబు చెప్పలేదు. మండుతున్న పొయ్యి లోకి రెండు క్షణాలు చూసింది. ఆమె కళ్ళల్లో నీరు నిలవడంలేదు. చెంపల మీదుగా కారిపోతోంది. చెంగుతో ముఖం తుడుచుకుంది.

"సీతా" అన్నది వెంకమ్మ.

సీత ముందుకు వంగి తల్లి ముఖంలోకి చూసింది.

"ఏమైనాదే. సెప్పు."

"నీళ్ళు తెచ్చేవా ?"

సీత హృదయం లిప్త కాలంపాటు ఆగిపోయింది.

"మరే...మరే..."

"తేనేదా?"

"కుండ పగిలిపోనాదే" అన్నది సీత మెల్లగా. సీతకు దుఃఖం ముంచుకు వచ్చింది. "కాలు జారి పోనాదే. సత్తెం. ఇంకెప్పుడూ పగలగొట్టనే. సిన్నోడికి ఈ ఇసయం సెప్పమాకేం.." తల్లిని పట్టుకుని ఏడుస్తూ అన్నది.

వెంకమ్మ కూతురును దగ్గరకు తీసుకుని తల నిమిరింది. ఆమెకూ దుఃఖం ఆగలేదు.

"సిన్నోడ్ని.." అని ఆగిపోయింది వెంకమ్మ.

"సిన్నోడ్ని?"

"కొట్టారే... తల బద్దలు సేసేసినారే."

సీత ఉలిక్కిపడి తల్లి ముఖంలోకి చూసింది.

వెంకమ్మ పెద్దగా ఏడుస్తుంది.

"ఎప్పుడు?" అడిగింది సీత.

"ఇప్పుడే."

"ఓగేటి?"

"సౌదరయ్య కొడుకు. రచ్చబండ కాడ. సౌదరయ్య కొడుకు ఈస్వరానికీ, సిన్నోడికీ మాటామాట వచ్చిందట. ఆమాల్ను ఈస్వరం, ఎంకటసామి, ఈరయ్యా ముగ్గురూ కల్సి కర్రలుచ్చుకుని సిన్నోడి తల బద్దలు కొట్టేసినారమ్మా..."

సీత హృదయం బాధతో సుళ్ళు తిరిగింది. చాలి

సేపటి వరకూ మౌనంగా మంటలోకి చూసింది. వెంకమ్మ కుమిలి కుమిలి ఏడుస్తోంది. తల్లికి ఎట్లా వోదార్చాలో సీతకు అర్థం కాలేదు. చివరకు అడిగింది: "పెద్దోడేడి?"

"సిన్నోడ్ని పట్నం తీసుకుపోయాడు. నే కూడా ఒత్తానంటే ఒద్దన్నాడు.. ఆ ముదనష్టపోళ్ళు సిన్నోడ్ని బలంగా కొట్టాక...అంతా రగతం...నన్ను కూడా సరింగ సూడనీలేదు..." దుఃఖంలో ఆమె మాటలు ఎక్కడిక్కడ తెగిపోతున్నాయి.

సీత లేచి నుంచుంది. కళ్ళు తుడుచుకుంది. మధ్య గదిలోకి వచ్చింది. దుఃఖం ఆగడం లేదు. దీపం వెలిగించాలన్న ఆలోచన హృదయాంతరాల్లో పొంగి పొర్లుతున్న ఆవేదనలో ఇంకిపోయింది. బైటకు వచ్చింది. అరుగు మీద నుంచుంది. పావడిలో లేగ దూడ అరుస్తోంది. దాని దగ్గరకు వెడదామని, దాని తల నిమురుదామని అనిపించడంలేదు. అరుగు దిగి మంచం వాల్చింది. తిరిగి ఎత్తింది. కోడుకు తల అన్ని కొట్టుకుంది. "సిన్నోడా.. సిన్నోడా" మనసు కుళ్ళికుళ్ళి ఏడుస్తుంటే అనుకుంది.

సీత పుట్టిన సంవత్సరానికి వెంకమ్మ భర్త ఇహ లోక యాత్ర చాలించాడు. భర్త మిగిల్చిన నాలుగు ఎకరాల భూమితోనూ, తన గుండె నిబ్బరంతోనూ పెద్దకొడుకు నారాయణను, చిన్నకొడుకు రమణయ్యను, సీతనూ పెంచి పెద్ద చేసింది వెంకమ్మ. తల్లి మంచితనం నారాయణకూ, సీతకూ అబ్బింది. రమణయ్య కోపిష్టి. తొందరపాటు మనిషి. సీతకు పదహారేళ్ళుంటాయి. చందనపు బొమ్మలా అందంగా వుంటుంది. పాల నురుగులాటి యవ్వనం సీత రూపు రేఖలను మరింత దేదీప్యమానం చేసింది. సీతలాటి అందగత్తె ఆ వూళ్లోనే కాదు, ఆ చుట్టుప్రక్కల వూళ్ళల్లో కూడా ఎవరూ లేరు. సీత పొందు కావాలనే ఉబలాటం ఆవూరి కుర్రకారుకే కాదు, పెద్దవాళ్ళకూ ఉంది. రమణయ్య అంటే భయం వల్ల కావచ్చు, వెంకమ్మ కుటుంబం మీదున్న గౌరవం వల్లకావచ్చు. ఆ ఉబలాటం అవ్యక్తంగానే ఉండిపోయింది.

అయితే—

సరిగ్గా నెలా పదిరోజుల క్రిందట ఒక సంఘటన జరిగింది. ఆ సంఘటన జరిగి ఉండకపోతే ఈరోజు రమణయ్యను ఈశ్వరం, వెంకటస్వామి, వీరయ్య కలిపి రచ్చబండ దగ్గర కొట్టి ఉండేవారు కాదు.

ఆరోజు—

సాయంత్రం.

చీకటి పడలేదు.

సీత పొలానికి వెళ్ళింది. గడ్డి కోసుకుని మోపు కట్టి, తల మీద పెట్టుకుని సరివితోపు ప్రక్కగా ఉన్న బాట మీద మెల్లగా నడుస్తోంది. ఎదురుగా గుట్ట. గుట్టదాటితే వూరు. అంతలో ఈశ్వరం వెనక గుండా వచ్చి సీత చేయి పట్టుకు లాగాడు. సీత కుడి చేతికున్న నీలం రంగు గాజులు రెండు పగిలిపోయాయి. గడ్డిమోపు క్రింద పడిపోయింది. సీత నిశ్చేష్టరాలైంది. ఈశ్వరం సీత చేయి వదలలేదు. మరింత గట్టిగ పట్టుకుని సరివితోపులోకి లాగుతున్నాడు.

సీత కదలలేదు. ఆలోచలన్నీ ఆగిపోయాయి. గుండె మండుతూ వేగంగా కొట్టుకోసాగింది. గొంతులో తడి ఆరిపోయింది.

"సినబాబూ" అన్నది సీత పెద్దగా.

ఈశ్వరం ఉలిక్కిపడలేదు. ఎర్రగా ఉన్న కళ్ళతో అందంగా నవ్వాడు.

అతని చేతి పట్టు విడిపించుకోబోయింది సీత వీలు కాలేదు.

"ఒదులు."

"రాయే సీతా.. ఎవరూ లేదు."

"సినబాబూ."

సీత కాళ్ళు వణుకుతున్నాయి. ఈశ్వరం వదిలేట్టు లేదు. ఎక్కడలేని శక్తి కూడ దీసుకుంది. ఒక్కసారిగా ఈశ్వరం చేయి విదిలించుకుని గడ్డి మోపుకున్న కొడవలి అందుకుంది. చేయి వణుకుతోంది.

"ఒక్కడుగ్గాని ముందు కేస్తివా..." కొడవలి ఎత్తి పట్టుకుని అన్నది సీత.

ఈ హఠాత్‌చర్యకు ఈశ్వరం బిత్తరపోయాడు. నుంచున్న చోటు నుండి కదలలేదు. సీత వెన్నక్కి తిరిగి గట్టు దాటి పరుగెత్తుకుంటూ వూళ్లోకి వచ్చింది. ఇంట్లోకి వచ్చిన తర్వాత కూడా సీత అలుపు తగ్గలేదు. జరిగినదంతా రమణయ్యకు, తల్లికి చెప్పింది. రమణయ్య వింటూనే కోపంతో నిలువెల్లా వణకిపోతూ, పైపంచ మీద వేసుకుని ముల్లుకర్ర తీసుకుని బైటకు వచ్చాడు.

"అరే సిన్నోడా! ఆళ్ళతో ఎందుకురా తగాదాలు? ఆళ్ళు పెద్దోళ్ళు. ఎన్నిసేసినా సెల్లుద్ది. నా మాట ఇనుకో. పోనీక. పైగా మన పరువే పోద్ది. అసలేం జరగనేదనుకుందాం" రమణయ్యకు అడ్డువస్తూ అన్నది వెంకమ్మ.

"నీకుతెలీదు వూరుకోయే. ఆళ్ళకూ ఆడకూతుళ్ళున్నారు. ఆళ్ళనిలా సేత్తే వూరుకుంటారూ? సెప్పు." అన్నాడు రమణయ్య.

సమయానికి చౌదరయ్య, మునసబు ఇద్దరు ముగ్గురు వూరిపెద్దలు రచ్చబండ దగ్గరే ఉన్నారు. చౌదరయ్యను చూడగానే అప్పటివరకు తనను అధిగమిస్తున్న ఆవేశానికి అంతకుమించిన ఆవేదనకు కారణమైనవిషయాన్ని ఎట్లా చెప్పాలో రమణయ్యకు తోచలేదు.

"దండాలు బాబూ" అన్నాడు రమణయ్య వినయంగా.

మెలితిప్పినమీసాల్లోంచి చిన్నగా నవ్వి,"ఏమిట్రా రమణయ్య, బావున్నావా?" అడిగాడు చౌదరయ్య.

"తమతో ఒక ఇసయం సెబుదామని వచ్చేను." అన్నాడు రమణయ్య.

మునసబు ముందుకు జరిగి కూర్చున్నాడు.

చౌదరయ్య జేబులోంచి చుట్ట తీసి వెలిగించాడు. "ఏట్రోయ్ అది?" అన్నాడు.

జరిగిన విషయాన్ని చెప్పాడు రమణయ్య. చౌదరయ్య అంతా విని, "మావాడు అలాటి వాడు కాడే" అన్నాడు.

"అవునవును" అన్నాడు మునసబు.

"నేనబద్ధం సెబుతున్నానా?" కోపాన్ని దిగమింగుకుని అన్నాడు రమణయ్య.

చౌదరయ్య భుజాలు ఎగర వేశాడు. "ఏమో, అయినా చూడు రమణయ్య, మన బంగారం మంచిదైతే..." అని ఆగిపోయి పొగ పీల్చి వదిలాడు.

రమణయ్య శరీరంలోని రక్తం అంతా ఒక్కసారిగా అతని కళ్ళల్లోకి ప్రవహించి గడ్డ కట్టింది. "బాబూ! అబద్ధం సెబితే నాకేమీ రాదు. తమకూ ఆడకూతుళ్ళున్నారు. ఆళ్ళను ఎవరేనా అట్లా సేత్తే ఎట్లా ఉంటది?" అడిగాడు రమణయ్య.

"అడ్డి నరికి పారేస్తాం."

"మిగతా ఆళ్ళు కూడా అంతే అనుకోండి. సిన బాబును కాస్త ఒళ్ళు దగ్గరెట్టు కోమని సెప్పండి." అని ముల్లుకర్రను టకటక లాడించుకుంటూ వెళ్ళిపోయాడు రమణయ్య.

చౌదరయ్య వదనం వివర్ణమైంది. వణికే చేతొత్తో నోట్లోంచి చుట్ట తీసి రమణయ్య వెళ్ళిన వైపే చాల సేపటి వరకు చూస్తుండి పోయాడు.

చౌదరయ్య ఆ వూరికి మకుటంలేనిరాజు. అతని మాటకు తిరుగు ఉండదు. ఉండకూడదు. అథవా ఉన్నా ఏదో విధంగా ఆ'తిరుగు'ను రూపు లేకుండా చేయగల శక్తి అతనికి వుంది. సీతకు జరిగిన అవమానానికి తన కొడుకు కాకుండా మరొకరు మరొకరైతే పంచాయతీ పెట్టించేవాడే. అయితే ఇప్పుడది చేయదల్చుకోలేదు. 'నిజమేనా' అని ఈశ్వరాన్ని కూడా అడగలేదు. ఈశ్వరం అటువంటి పనులు చేస్తుంటాడని అతనికి తెలుసు. ఈ విషయాన్ని నలుగురి ముందూ తనను అడిగినందుకు రమణయ్య మీద 'కోపం' వచ్చింది చౌదరయ్యకు.

అందుకే మాట మీద మాట పెంచుకుని చౌదరయ్య మద్దత్తుతో రమణయ్యను ఒక్కడిని చేసి కొట్టారు. రమణయ్యకు నాలుగురోజుల వరకు స్పృహ రాలేదు. ఐదో రోజున స్పృహ వచ్చింది. కాని ప్రాణం నిలువలేదు.

పై వూరునుండి ఈ కేసు విషయాలు ఆరా తీయడానికి ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్ నలుగురు పోలీసులతో వచ్చాడు. చౌదరయ్య వాళ్ళందరకూ కోళ్ళు కోసి విందు చేశాడు. ఆవూళ్లోవాళ్ళురెండురోజులున్నారు, మూడో రోజున వెళ్ళిపోయారు. అంతే. ఏమీ జరగలేదు.

రోజులు గడచిపోతున్నాయి. వెంకమ్మ మానసికంగా చాల కృంగిపోయింది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ కూర్చుంటుంది. నారాయణకు తమ్ముడి చావు అఘాతంలా తగిలినా, ఆ బాధను దిగమింగుకుని కాలం దాటుకు వస్తున్నాడు. ఈశ్వరం ఆగడాలు రానురాను ముదిరి పోసాగాయి. సీత ఇంట్లోంచి బైటకు రావడం మానివేసింది. ఈశ్వరం అప్పుడప్పుడు నారాయణను మాటలతో కవ్వించేవాడు. నారాయణ ఆ మాటలేవీ పట్టించుకునే వాడుకాదు. మాట మీద మాట పెరిగితే తనే తగ్గిపోయేవాడు. ఇంటికి వచ్చి జరిగినదంతా తల్లితో చెప్పేవాడు.

"పెద్దోడా! అంతేరా ఆళ్ళు. పైన బగమంతుడు న్నాడు. ఆళ్ళ పాపాన ఆళ్ళే పోతారు." అన్నది వెంకమ్మ ఒకరోజు.

"ఎన్నాళ్ళనే వూరుకునేది?" అడిగాడు నారాయణ.

వెంకమ్మ ఏడుస్తూ, "సిన్నోడు నన్నాయం సేసిండు. నా కడుపు కాలిపోనాది. నువ్వూ నన్నా యం సేత్తావురా?" అడిగింది.

ఒకరోజు ఈశ్వరం తలవంచుకుని పోతున్న నారాయణను పేరెట్టి పిలిచి సీత మీద బూతు మాట విసిరాడు నవ్వుతూ. నారాయణ తన కోపాన్ని నిగ్రహించుకునేందుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదు. ముందుకు వచ్చి ఈశ్వరం చొక్కా పట్టుకున్నాడు. మెలి తిప్పి క్రింద పడేశాడు. మీద కూర్చుని ఈశ్వరం ముఖం మీద తన శక్తి కొద్దీ నాలుగు గుద్దులు గుద్దాడు. లేచి, "నాయాల! మాయమ్మ ముకం సూసి ఇంతటితో ఒదులుత్తుండాను. రగతం తాగుతాను. ఏటనుకున్నావో. ఒళ్ళు దగ్గరుంచుకో." అని తన దారిన తాను వెళ్ళిపోయాడు నారాయణ.

యాభై గజాల దూరం నుండి అంతా చూస్తూనే ఏమీ చేయలేకపోయాడు చౌదరయ్య. ఈ విషయం వెంకమ్మకు తెలియదు. సీతకు తెలిసింది. తల్లికి చెబుదామనుకుంది. చెప్పలేదు.

అర్ధరాత్రి సమయంలో వెంకమ్మకు హఠాత్తుగా

## దీపం

మెలకువ వచ్చింది. లేచి కూర్చుంది. కోడిగుడ్డు దీపం గదిలో సన్నగా వెలుగుతోంది. సీత పండుకున్న మంచం వైపు చూసింది. నిద్ర పట్టక కదులాడుతుంది సీత.

"సీతా" పిలిచింది వెంకమ్మ.

సీత లేచి కూర్చుంది. చల్లటి గాలి వీస్తోంది. దుప్పటి తీసి నిండా కప్పుకుంది.

"నిద్దోలా?"

"లేదే."

"ఏం?"

సీత జవాబు చెప్పలేదు. ఆమె మనసంతా అవ్యక్తమైన భయాందోళనతో నిండి ఉంది. మంచం దిగి నుంచుంది.

"కాసిని దప్పి కియ్యే" అన్నది వెంకమ్మ.

సీత ప్రక్కగదిలోకి కదలబోయింది. తలుపు మీద ఎవరో తడుతున్న చప్పుడు వినిపించింది.

"ఓరు."

"నేనే. రాజయ్యను. తలుపు తీయ్. బేగే."

సీత తలుపు గడియ తీసింది.

"ఏట్రా రాజయ్యా?" అడిగింది వెంకమ్మ.

రాజయ్య ముఖమంతా చెమట పట్టి ఉంది. ఆయాస పడుతున్నాడు. ఇంట్లోకి రెండడుగులు వేసి ఆగిపోయాడు. వెంకమ్మ ముఖంలోకి చూశాడు. "మరి...మరేం.." అని ఆగిపోయాడు.

"ఏట్రా. సెప్పు." విసుక్కుంది వెంకమ్మ.

"నేను మీ పొలం కాడ్నుండే వత్తుండ.. మరి.. మరి.. పెద్దోడ్ని సంపేసినాడే.. మంచెంత రగితం.. నా కళ్ళు తిరిగిపోనాయి..." ఆతర్వాత రాజయ్య ఏం చెప్పాడో సీతకు వినిపించలేదు. కుప్పలా కూలిపోయింది. అరగంట తర్వాత స్పృహ వచ్చింది. చుట్టూ చూసింది. తల్లి లేదు. తలుపు బార్లా తెరచి ఉంది. లేచి నుంచుంది. దేవుడి పటం దగ్గరకు వచ్చింది. రెండు చేతులూ జోడించి చిన్నగా పెదాలు విప్పింది. కళ్ళల్లో నీరు నిలవడంలేదు. దేవుడి పటం మీద సీత నీడ పడుతోంది. "బగవంతుడా..." అన్నది సీత. దుఃఖం ఆగలేదు. "నా కోసం.. మేమేం సేసాం?..

... నువ్వు గొప్పోడివి...శానాశానా గొప్పోడివి."

వెనకకు తిరిగింది. తలుపు దగ్గరకు నడిచి బైటకు చూసింది. చిక్కగా కురుస్తున్న వెన్నెలలో వూరు మత్తుగా నిద్ర పోతోంది. తలుపు వేసి గడియ పెట్టింది. దీపం దగ్గరకు వచ్చింది. వత్తి పెద్దది చేసింది. చిమ్నీ మసి బారి పోసాగింది. ●




నాకు ఒకటి ఇవ్వూ!

కృష్ణా

మిఠాయిలు

KCP

కె.సి.పి. లిమిటెడ్

ఉయ్యూరు & మద్రాసు

Criterion-KCP-964 Te